ఘనంగా వైఎస్ జయంతి



2



2

ఆలూర్ అభివృద్ధి అంతంతే..

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## స్నాతకోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

**అక్షర టుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ వర్సిటీలో ఈనెల 16న నిర్వహించే రెండో స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని వీసీ ప్రొఫెసర్ టి యాదగిరి రావు అన్నారు. మంగళవారం స్నాతకోత్సవ కమిటీ కన్వీనర్ల నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్సిటీ మొదటి స్నాతకోత్సవం తరువాత 12 ఏళ్లకు జరిగే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. 2014-23 వరకు పీజీలో వివిధ విభాగాల నుంచి ఫస్ట్ ర్యాంకు సాధించిన 130మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్‌స్‌తోపాటు జూన్ 30, 2025 వరకు వివిధ విభాగాల్లో పరిశోధనలు పూర్తి చేసిన 156 మంది పరిశోధక విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, కంట్రోలర్ సంపత్ కుమార్, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.



## బాన్సువాడ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా గంగాధర్



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఐ.గంగాధర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు కళాశాల విద్యాకమిషనర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన వేణుగోపాలస్వామి ఆర్మూర్ డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు. జూన్ 24న 'అక్షరటుడే'లో ప్రచురితమైన 'డిగ్రీలో ప్రవేశాలు అంతంతే..' కథనానికి ఉన్నతాధికారులు స్పందించినట్లు అధ్యాపకులు పేర్కొన్నారు. కళాశాలలో అడ్మిషన్లు ఏడాదికేడాది పడిపోతుండడంపై ఉన్నతాధికారులు విచారించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన గంగాధర్ కళాశాలకు న్యాక్ బీ ప్లస్, అటానమస్ రావడంలో ఎంతో కృషి చేశారని గుర్తించి ఆయనను తిరిగి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని ప్రిన్సిపాల్ గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## నగరంలో ఊర పండుగ 'బండారు' కార్యక్రమం..




పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**అక్షరటుడే, ఇందూరు:** ఇందూరులో ఈ నెల 13న జరిగే ఊర పండుగకు సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నగరంలోని గాజుల్‌పేటలో బండారు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. ఊర పండుగ ప్రారంభ సూచికగా బండారును పోస్తారు. ఈరోజు నుంచి ఊర పండుగ గ్రామదేవతల ఊరేగింపు వరకు ఊరు దాటి వెళ్లొద్దని ప్రజలు విశ్వసిస్తారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ గంగాధర్, కో-కన్వీనర్ ప్రవీణ్, అన్ని కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. నందిపేటకు హెడ్ కానిస్టేబుల్ ఎండీ రియాజుద్దీన్, మోపాల్ పీఎస్‌కు చెందిన కే పరమేశ్వర్, సీఎస్‌బీకి చెందిన పి వసంత్ రావు, ఆరో టౌన్‌కు చెందిన జక్రయ్య, మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన అరుణ కుమారి, రూరల్ పీఎస్‌కు చెందిన అనురాధ, పీసీఆర్‌కు చెందిన జీవీ రమణేశ్వరి, సీసీఆర్‌బీకి చెందిన ముంతాజ్ బేగం ఉన్నారు. ఈ మేరకు మంగళవారం సీపీ సాయి చైతన్య వారిని అభినందించారు.





నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ప్రభుత్వం పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను నియమించింది. సుమారు పదేళ్లుగా ఇన్‌ఛార్జీల పాలనలో ఆస్పత్రి నిర్వహణ అధ్వానంగా మారింది. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పారిశుధ్యం, సిబ్బంది సమయపాలన, పరికరాల కొరత, నిర్వహణ లోపం ఇలా అనేక సమస్యలతో దీనస్థితికి చేరింది. కాగా.. కొత్త సూపరింటెండెంట్ రానుండడంతో సమస్యలు పరిష్కారమై ఆస్పత్రి గాడిలో పడుతుందని జిల్లావాసులు ఆశిస్తున్నారు.

– అక్షరటుడే, ఇందూరు

# తీరు మారేనా..!

▸ సమస్యల వలయంలో నిజామాబాద్ జీజీహెచ్ ▸ పదేళ్లుగా ఇన్‌ఛార్జీల పాలన ▸ పూర్తిస్థాయి సూపరింటెండెంట్ నియామకం


నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 13 ఏళ్ల క్రితం జనరల్ ఆస్పత్రి కోసం ఏడంతస్తుల అద్దాలమేడ నిర్మించారు. తొలుత 500 పడకలతో ఏర్పాటు చేయగా.. తదనంతర కాలంలో 700 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రారంభంలో మెరుగైన సేవలు అందించినా.. కొంత కాలం తర్వాత సమస్యలు తాండవిస్తున్నాయి.

### డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

జీజీహెచ్‌లో ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇన్ పేషెంట్లు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాల్వలకు సంబంధించిన పైప్ లైన్లు ధ్వంసం అవడంతో మురికి నీరంతా ఆవరణలో పారుతోంది. అలాగే తాగునీటి వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే ఉంది. అలాగే ఆస్పత్రి అద్దాలు చాలా వరకు ధ్వంసం అయ్యాయి. దీంతో వర్షాకాలం, చలికాలం రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా.. వీటి మరమ్మతులకు రూ.3 కోట్ల నిధులు అవసరమని గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటివరకు మంజూరు కాలేదు.

### స్ట్రెచర్ల కొరతతో ఇబ్బందులు

పెద్దాసుపత్రికి వైద్యం కోసం నిత్యం వేల మంది వస్తుంటారు. ప్రస్తుత సీజన్‌లో నిత్యం సుమారు 2 వేలకు పైగానే ఓపీ నమోదవుతుంది. ఇందులో సుమారు 500



మంది వరకు ఇన్ పేషెంట్లుగా అడ్మిట్ అవుతారు. అయితే రోగుల సంఖ్యకు అనుగుణంగా స్ట్రెచర్లు, వీల్ చైర్లు లేకపోవడం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవేళ అందుబాటులో ఉన్నా.. రోగులను తీసుకెళ్లేందుకు వార్డు బాయ్‌లు దొరకరు. దీంతో బంధువులే వార్డు బాయ్లు అవతారం ఎత్తే పరిస్థితి నెలకొంటుంది.

### సిబ్బంది కొరత..

జిల్లా జనరల్ ఆస్పత్రి నిర్మించిన నాటి నుంచి సిబ్బంది కొరత తీవ్రంగానే ఉంది. సగానికి పైగా ఖాళీలు ఉండడంతో ఒక్కోసారి వైద్యం పూర్తిస్థాయిలో అందడం లేదు. జీజీహెచ్‌కు మొత్తం 281 మంది ఉండాల్సి ఉండగా.. రెగ్యులర్ సిబ్బంది 104 మంది, కాంట్రాక్టు సిబ్బంది 69 మంది ఉన్నారు. కాగా.. 108 ఖాళీలు ఉన్నాయి. అలాగే పారిశుధ్య కార్మికులు సైతం పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఉన్నవారిపైనే భారం పడుతోంది.

### దొంగతనాలూ ఎక్కువే..

జిల్లా జనరల్ ఆస్పత్రిలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనలు ఉండగా.. పలుమార్లు చిన్నారులను అపహరించిన దాఖలాలు ఉన్నాయి. పగలంతా రోగి బంధువులపై ఆజమాయిషీ చేసే సెక్యూరిటీ సిబ్బంది రాత్రి వీధుల్లో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని స్పష్టం అవుతోంది.

### మంత్రి హెచ్చరించినా..

గతేడాది ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జీజీహెచ్‌ను సందర్శించారు. ఈ నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు. వైద్యుల హాజరు, సిబ్బంది పనితీరు, పరిశుభ్రత, ఆస్పత్రి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. మంత్రి స్పందన తీరుతో ఆస్పత్రి నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### మాతా శిశు కేంద్రం ప్రారంభమయ్యేనా..

జిల్లా జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి అధికంగా ఉండడంతో గర్భిణులు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా కేంద్రం నిర్మించారు. నిజామాబాద్ బస్టాండ్ ఎదురుగా రూ.4కోట్లతో ఏడాదిన్నర క్రితం నిర్మాణం పూర్తి చేశారు. కానీ ఇప్పటికీ ఆ భవనాన్ని ప్రారంభించలేదు. ఒకే లిఫ్ట్ ఉన్నదనే కారణంతో వినియోగించడం లేదని సమాచారం. ఇప్పటికైనా అందుబాటులోకి తీసుకొచ్చి వినియోగిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

## బోధన్‌లో కలెక్టర్ పర్యటన

**అక్షరటుడే, బోధన్:** బోధన్ పట్టణంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టనంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, తదితర కార్యక్రమాలపై చేపడుతున్న ముందస్తు చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్‌ల జారీ, ఇతర అంశాలపై సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనవారు ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని, ఆర్థిక స్థోమత లేనివారికి మెప్మా ద్వారా రుణాలు ఇప్పించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని, నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని పాండు ఫారం తర్పాను సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి తుకారాం రాథోడ్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ,తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

## జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా కృష్ణ మాలకొండ రెడ్డి



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి కృష్ణ మాలకొండ రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తూ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను, వైద్య కాలేజీకి ప్రిన్సిపాల్‌ను నియమించారు. గతంలో జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ప్రతిమారాజ్ కొనసాగారు. ఆమెపై అనేక ఆరోపణలు రావడంతో జనవరిలో ఆమెను ప్రభుత్వం తొలగించింది. సూపరింటెండెంట్ బాధ్యతలు డాక్టర్ శ్రీనివాస్‌కు అప్పగించింది. తాజాగా ఉస్మానియా మెడికల్ కాలేజీలో కార్డియాలజీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కృష్ణ మాలకొండ రెడ్డిని జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నియమించింది.

### వైద్య కాలేజీ ప్రిన్సిపాల్‌గా కృష్ణమోహన్

నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కాలేజీ ప్రిన్సిపాల్‌గా కృష్ణమోహన్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం నిజామాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శివప్రసాద్ వ్యవహరిస్తున్నారు. ఆయన స్థానంలో కృష్ణమోహన్ తర్వలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

## కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నియామకం



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వాల్యా, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వర్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు హెల్త్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గాంధీ మెడికల్ కళాశాలలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా వాల్యా పని చేశారు. అలాగే మహేశ్వరం మెడికల్ కళాశాలలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా వెంకటేశ్వర్లు కొనసాగారు. ప్రస్తుతం ఈ ఇద్దరికి పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిరువురు మెడికల్, జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

### ఇన్నాళ్లూ ఇన్‌ఛార్జీల పాలన..

కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇప్పటివరకు ప్రొఫెసర్ శివప్రసాద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఫరీదా బేగం ఇన్‌ఛార్జీలుగా కొనసాగారు. అయితే ఆరోగ్యశ్రీ నిధుల విషయంలో జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల హెల్త్ డైరెక్టర్ జిల్లా ఆస్పత్రి తనిఖీ సమయంలోనూ ఆమె ముఖం చాటేశారన్న ఆరోపణలున్నాయి. ఇది జరిగిన కొద్దిరోజులకే ఆమె స్థానంలో కొత్తగా పూర్తిస్థాయిలో సూపరింటెండెంట్ రావడం గమనార్హం.

## వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలోగల వెల్‌నెస్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ బి రాజశ్రీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు రిజిస్టర్, ఓపీ విభాగం, ల్యాబ్, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు అందుబాటులో ఉండి, నాణ్యమైన సేవలందించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆమె వెంట సెంటర్ వైద్యురాలు కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

## కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై పోలీసులు శ్రద్ధ వహించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సాయి చైతన్య సిబ్బందికి సూచించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మెగా వైద్యశిబిరాన్ని మంగళవారం సీపీ ప్రారంభించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మల్లారెడ్డి, నారాయణ ఆస్పత్రుల నిర్వాహకులు శిబిరాన్ని నిర్వహించారు.

### ఆరోగ్య నియమాలు పాటించాలి

పోలీస్‌శాఖలో సిబ్బంది తప్పనిసరిగా ఆరోగ్య నియమాలు పాటించాలని సీపీ సూచించారు. పోలీసులు విధి నిర్వహణలో ఉంటూ ఆరోగ్యపై శ్రద్ధ పెట్టకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధులు వేగంగా విస్తరిస్తున్నాయని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య శిబిరాల నిర్వహణ అభినందనీయన్నారు. కార్యక్రమంలో ఏసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, ఏసీపీ (ఏఆర్) రాంచందర్ రావు, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ (అడ్మిన్), శేఖర్ బాబు (ఎంటీవో), తిరుపతి (వెల్ఫేర్), సతీష్ (హోంగార్డ్స్), పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ సరళ, వైద్యులు సుధాకర్‌రావు, చంద్రమోహన్, వంశీ, అఫ్రిన్, నిఖిత, షహభాజ్ హైమద్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ సాయిచైతన్య



## సకాలంలో ఇందిరమ్మ బిల్లులు మంజూరు

**అక్షరటుడే, బాన్సువాడ:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందుతాయని, నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. బీర్కూరు మండలం చించోలి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో మహబూబ్, జీపీ కార్యదర్శి సచిన్ ఉన్నారు.

## మహిళా సంఘాల పనితీరు అభినందనీయం

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలు సమర్థవంతంగా నిర్వహించాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రశంసించారు. వారి పనితీరును మెచ్చుకున్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి మండల సమాఖ్యలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 183 కొనుగోలు కేంద్రాల ద్వారా మహిళా సంఘాలు ధాన్యం కొనుగోళ్లు చేపట్టాయన్నారు. ఇకపై కొనుగోలు కేంద్రాల సంఖ్య మరింత పెంచుతామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు మరింత బాగా పని చేయాలని సూచించారు.

### ప్రతి మహిళ సభ్యత్వం తీసుకోవాలి..

18 ఏళ్లకు పైబడిన ప్రతి మహిళ.. మహిళా సంఘంలో సభ్యత్వం తీసుకునేలా సిబ్బంది చూడాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా బ్యాంకు లింకేజీ టార్గెట్‌ను వందశాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, డీఆర్డీవో సురేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, డీపీఎం రాజయ్య, ఎంపీడీవో ఎప్సీబా, మండల సమాఖ్య ఏపీఎం మోహిజ్, సీసీలు విశ్వనాథం, అంజాగౌడ్, స్వరూప, సంజీవులు, మండల సమాఖ్య పాలకవర్గం అధ్యక్షులు గోదావరి, కార్యదర్శి సరస్వతి, కోశాధికారి పూజా, గ్రామ సంఘాల ప్రతినిధులు వీవోఏలు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

## పల్లెలు పచ్చగా ఉంటేనే దేశం బాగుంటుంది



**అక్షరటుడే, భిక్కనూరు:** పల్లెలు పచ్చగా ఉంటేనే దేశం బాగుంటుందని ప్రజాకవి గోరటి వెంకన్న అన్నారు. ఆయన భిక్కనూరు మండలం లక్ష్మీదేవుపల్లిలో కొత్త ఎల్లయ్య జ్ఞాపకార్థం నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో గోరటి వెంకన్న మాట్లాడుతూ ప్రపంచంలో రైతులను మించిన వాళ్లు లేరని పేర్కొన్నారు. ఎవరూ ఏ వృత్తిలో ఉన్నా, ఎంత గొప్ప ఆవిష్కరణలు చేసినా.. రైతు పంటలు పండిస్తేనే మన మనగడ ఉంటుందని తెలిపారు. పల్లెల్లో ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉండాలని అన్నారు. అనంతరం అందరూ ఒక్కటిగా కలిసి జీవించాలని సూచించారు. అప్పుడే అన్ని సాధించుకోగలుగుతామని వివరించారు. పల్లెలు పచ్చగా ఉంటేనే.. పట్టణాలు, దేశం బాగుంటాయన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం అందించాలని గోరటి వెంకన్న కోరారు. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలను సైతం కలిసి విజ్ఞప్తి చేస్తానని వివరించారు. ఈ సందర్భంగా పలు జానపద గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, నాయ్యవాది క్యాతం సిద్ధిరాములు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ .వెంకట్ రాములు, సీపీఎం నేతలు చంద్రశేఖర్, కొత్త నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణంలోని 8, 21వ వార్డులలో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడవద్దని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని అవగాహన కల్పించారు. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు ఆఫీసర్ చరణ్, జవాన్లు, ఆశా వర్కర్లు, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు, కాలనీలో మొక్కలు నాటుకోవాలని భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కేసీఆర్ కాలనీలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మెప్మా సిబ్బంది, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చేసింది కొంత..
# చేయాల్సింది కొండంత



▶ఆలూర్ అభివృద్ధి అంతంత మాత్రమే.. ▶అధ్వానంగా రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ ▶నిధులు ఖర్చయినా నిష్ప్రయోజనమే..

**చేసింది కొంత.. చేయాల్సింది కొండంత అన్నట్లుగా ఉంది.. ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిస్థితి. ఆర్మూర్ నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీల్లో ఈ గ్రామం ఒకటి. కానీ అభివృద్ధిలో జీపీలతో పోలిస్తే వెనకబడి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు.**

**– అక్షరటుడే, ఆర్మూర్**

ఆలూరు గ్రామ పంచాయతీలో 14 వార్డులు ఉన్నాయి. జీపీలో 6,594 మంది జనాభా ఉంది. 5,316 మంది ఓటర్లు స్త్రీలు 2,900, పురుషులు 2,416 మంది ఓటర్లు ఉన్నారు. ఆర్మూర్ మండలంలో మేజర్ జీపీగా ప్రకటిస్తూ 2022 అక్టోబర్ 11న ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. అయితే మండల కేంద్రం కావడంతో ఎంపీడీవో, విద్యాశాఖ, తహశీల్దార్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఏ శాఖకు కూడా సొంత భవనం లేదు. పోలీస్, ఇరిగేషన్ తదితర శాఖలన్నీ ఆర్మూర్ కేంద్రంగానే పనిచేస్తున్నాయి.

### ఇందిరమ్మ కాలనీలో సమస్యలెన్నో..

ఆలూరు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. కాలనీలో సరైన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేదు. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. అలాగే 12వ వార్డులో కూడా డ్రెయినేజీలు లేక మురికినీరు రోడ్డుపైకి వస్తోంది. కాగా.. ఆలూరు సంతకు ఆర్మూర్, నందిపేట, నిజామాబాద్, డొంకేశ్వర్ ప్రాంతాల వ్యాపారులు వచ్చి విక్రయాలు జరుపుతారు. కానీ సంతలో కనీస వసతులు లేవు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, షెడ్లు లేక వ్యాపారస్తులు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు.


### గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం..



ఆలూరు గ్రామంలో సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ. 2 కోట్లకు పైగా నిధులు విడుదలయ్యాయి. మరిన్ని నిధులు రాబట్టి గ్రామంలో అన్ని సదుపాయాలు కల్పిస్తాం.

**- ముక్కెర విజయ్, కాంగ్రెస్ పార్టీ ఆలూరు మండల అధ్యక్షుడు**

### ఉత్తమ జీపీగా తీర్చిదిద్దా..



ఐదేళ్లలో ఆలూరు గ్రామాన్ని రూ. 2 కోట్ల పైచిలుకు నిధులతో అభివృద్ధి చేశాం. శ్మశాన వాటిక రైతు వేదిక, పల్లె దవాఖాన, వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం, క్రీడా మైదానం, బీటీ రోడ్లు, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ ఇలా అన్ని వసతులు కల్పించాం. జిల్లాలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును అందుకున్నాం. కానీ చేసిన పనులకు బిల్లులు ఇంకా రాలేదు.

**–కల్లెం మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆలూరు**

## లింగంపేట్‌లో వనమహోత్సవం



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరేష్ మాట్లాడుతూ.. చెట్లతోనే మానవుని మనుగడ ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఐదు మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మొక్కలను నాటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్, ఎంపీవో మలహరి, పాఠశాల ప్రత్యేక అధికారిణి వాసంతి, ఏపీవో పాల్గొన్నారు.

## ఎస్సై రాఘవేందర్‌కు సన్మానం



**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలానికి బదిలీపై వచ్చిన ఎస్సై రాఘవేందర్‌ను మంగళవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సున్నం సాయిలు, వడ్ల సతీష్, పెర్క రాములు, అరిగె నారాయణ, సాయిలు, ఉల్లెంగ గోపి, రవి, కొప్పుల సాయిలు, శేఖర్, పర్వయ్య, బ్యాగరి సాయిలు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిజాంసాగర్‌లోని స్త్రీ శక్తి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ఉద్దేశంతో మహిళా శక్తి కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆరోగ్య శిబిరం




**అక్షరటుడే,ఇందల్వాయి:** డిచ్‌పల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు మానసికంగా శారీరకంగా పరిపూర్ణంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగేనీరు అందించాలని ప్రిన్సిపాల్ సవితను సూచించారు. ప్రతినెలలో 300 మంది విద్యార్థులు పాఠశాలలో రెండుసార్లు ఆరోగ్య శిబిరాన్ని ఈ పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజు పాఠశాలలో సాయంత్రం ఇచ్చే ఉడకబెట్టిన పల్లీలు, బఠానీలు ఖచ్చితంగా తినాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సవిత ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాల ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్ వినీత్, ఆరోగ్య కార్యకర్తలు దేవి మేరీ, శోభ ఆశా కార్యకర్తలు తల్లిదండ్రులు విద్యార్థినులు పాల్గొన్నారు.

## గాంధీ గంజ్ వర్తకుల సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని గాంధీగంజ్ కూరగాయల వర్తకుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య కోరారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూరగాయల అమ్మకానికి అనుగుణంగా నూతన షెడ్డు నిర్మించాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. మార్కెట్ యార్డు రికార్డులో పేర్లు నమోదు చేసి అద్దె వసూలు చేయాలన్నారు. వర్షాకాలంలో మురికినీరు సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రైవేట్ వ్యాపారస్తులు కూరగాయల వర్తకుల వద్ద డబ్బులు వసూలు చేయకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో కూరగాయల మార్కెట్ రిటైల్ వర్తకుల సంఘం అధ్యక్షుడు లింగం, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సత్యనారాయణ, సలీం, గోవర్ధన్, సాయిలు, పరశురాం ఉన్నారు.

## బిచ్కుంద బల్దియాకు డెడ్‌బాడీ ఫ్రీజర్ అందజేత




**అక్షరటుడే, బిచ్కుంద:** బిచ్కుంద మున్సిపాలిటీకి లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో ఉచితంగా డెడ్‌బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు. బిచ్కుంద మఠాధిపతులు సోమలింగ శివాచార్య మహారాజ్ చేతుల మీదుగా మంగళవారం బిచ్కుంద మున్సిపల్ కమిషనర్ హయ్యూమ్‌కు అందించారు. గ్రామంలో ఎవరైనా మృతిచెందిగా ఉచితంగా ఈ సేవలను వినియోగించుకోవచ్చని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాజు, రీజియన్ ఛైర్‌పర్సన్ ఓం ప్రకాశ్, కార్యదర్శి గోపాల్, లక్ష్మణ్, జగదీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి




**అక్షరటుడే, ఆర్మూర్:** దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కిసాన్ సంయుక్త మోర్చా ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని విలేకరులతో మాట్లాడారు. పీఎం మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నల్లచట్టాలను తీసుకొచ్చారన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతిస్తున్నట్లుగా ఎస్‌కేఎం జిల్లా నాయకులు బి దేవరాం, వెంకటేష్ తెలిపారు. సమావేశంలో రైతు నాయకులు జక్కం శేఖర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్సార్ జయంతి

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఆయన ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. – అక్షరటుడే, నెట్‌వర్క్


నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు


జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు


నందిపేట్‌లో..



నగరంలో వైఎస్సార్ అభిమాని భిక్షపతి ఆధ్వర్యంలో..


ఆలూర్ మండల కేంద్రంలో..


మద్నూర్ మండల కేంద్రంలో..



నిజాంసాగర్ మండల కేంద్రంలో..


పిట్లం మండల కేంద్రంలో..